
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 8 డిసెంబర్ 2022
5
తిరుపతి



సిఎంకు ఘన స్వాగతం, వీడ్కోలు

ప్రజాశక్తి - రేణిగుంట సూళ్లూరుపేట నియోజకవర్గ ఎంఎల్ఎ కిలివేటి సంజీవయ్య కుమార్తె వివాహానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు జిల్లాకు విచ్చేశారు. ఈ సందర్భంగా బుధవారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ఘన స్వాగతం లభించింది. భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనంతపురం రేంజి డిఐజి రవిప్రకాష్, తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎస్‌పి పరమేశ్వరరెడ్డి, కమిషనర్ అనుపమ అంజలి, ఎంఎల్‌ఎలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కోనేటి ఆదిమూలం సిఎంకు స్వాగతం పలికారు. వీరితో పాటు అడిషనల్ ఎస్‌పి కులశేఖర్, శ్రీకాళహస్తి ఆర్‌డిఒ రామారావు, డిఎస్‌పిలు రామచంద్రయ్య, సురేంద్ర, నందకిషోర్, ఎయిర్‌పోర్టు సిఎస్ఒ రాజశేఖర్, రేణిగుంట తహశీల్దార్ శివప్రసాద్ ఉన్నారు. మధ్యాహ్నం 3.10కి మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుతో కలిసి నెల్లూరుకు హెలికాప్టర్‌లో బయల్దేరి వెళ్లారు. సాయంత్రం 5.10 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచే అమరావతికి తిరుగు ప్రయాణమయ్యారు.

జిల్లాపై 'మాండోస్' తుపాను ఎఫెక్ట్

మూడు రోజుల పాటు భారీ వర్షాలు

తిరుపతిలో హెల్ప్‌లైన్ ఏర్పాటు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

బంగాళాఖాతంలో 'మాండోస్' తుపాను ఎఫెక్ట్ అర్ధరాత్రి నుంచి జిల్లాలో భారీ వర్షాలు నమోదు కానున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని మండలాల్లోనూ కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామని, జాలర్లు ఈనెల 10 వరకు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని, పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కె.వెంకటరమణరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. బుధవారం ఉదయం జిల్లా అధికారులతో సమావేశమై అన్ని మండలాల తహశీల్దార్లతో, ఎంపిడిఒలతో, స్పెషల్ ఆఫీసర్లతో జేసీ డికె బాలాజీతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖతో మాట్లాడినప్పుడు ఉదయం వరకు తుఫాన్ దిశ మారలేదని, తప్పనిసరిగా ఏ.పి. లోనే తిరుపతి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని సూచించారని ఆ మేరకు మంగళవారం రాత్రి అధికారులకు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించామని అన్నారు. ప్రధానంగా సముద్రతీర మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జాలర్లు ఎట్టి పరిస్థితిలలో ఈ నెల 10 వరకు సముద్రంలో చేపల వేటకు వెళ్ళరాదని, నిన్న రాత్రి సమాచారం మేరకు 202 మంది జాలర్లు వేటకు వెళ్ళినట్లు తెలిసిందని, అప్రమత్తం చేయడంతో 118 మంది తిరిగి వచ్చేశారని, మరో 84 మంది నేటి మద్యాహ్నం లోపు చేరుకునే విధంగా ఆ గ్రామ ప్రజలకు తెలియజేయాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో రెవిన్యూ యంత్రాంగం అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి వసతి , ఆహారం , తాగునీరు వంటివి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని, ముందస్తుగా గర్భిణీలు, చిన్న పిల్లలు, ముసలివాళ్ళను తరలించేందుకు వాహనాలను సిద్ధం చేసుకుని ఉండాలని సూచించారు. సచివాలయ సిబ్బంది స్థానికంగానే 24 గంటలు అందుబాటులో ఉండాలని అన్నారు. పంచాయితీ రాజ్ మరియు ఆర్ అండ్ బి శాఖలు ప్రమాద చెరువులను, రహదారులను ముందుగానే గుర్తించి గస్తీ ఏర్పాటు చేసి



ప్రత్యామ్నాయం కల్పించాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ మానవ, పశు నష్టం జరగడానికి వీలు లేదని అన్నారు. జిల్లా పంచాయితీ అధికారి నేటి సాయంత్రం కల్లా అన్ని గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టి బ్లీచింగ్ మెటీరియల్ అందుబాటులో ఉంచాలని , అంటు రోగాలకు తావివ్వరాదని అన్నారు. జిల్లా వైద్య శాఖ అవసరమైన మందులను అన్ని సి.హెచ్.సి. లు, పి.హెచ్.సి. లు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో అందుబాటులో ఉంచి పునరావాస కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు కావాలని సూచించారు. పాత పాఠశాలల భవనాలను, ఇళ్ళను పరిశీలించి ఏదైనా ప్రమాదాలకు అవకాశం ఉంటే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూడాల్సి ఉంటుందని అన్నారు. వర్షాల వల్ల జరిగే విద్యుత్ అంతరాయాన్ని నాలుగు గంటల లోపు పునరుద్ధరించే ఏర్పాట్లు చూడాలని అవసరమైన పోల్స్, కండక్టర్స్ అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. జిల్లాలోని తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట, గూడూరు రెవిన్యూ డివిజినల్ అధికారులు తమ పరిధిలో నిరంతర పర్యవేక్షణ జరగాలని ఆదేశించారు.

జేసి డి.కె.బాలాజీ మాట్లాడుతూ గత మూడు సార్లు హెచ్చరికలు జారీ చేసినా దేవుడు దయవల్ల ప్రమాదం తప్పిందని ప్రస్తుతం ఆ పరిస్థితి కనబడడం లేదని వాతావరణ శాఖ నుండి హెచ్చరికలు జారీ అవుతున్నాయని, సమాచార వ్యవస్థ దెబ్బతినకుండా ముందుగానే సర్వీస్ ప్రొవైడర్లకు సూచనలిచ్చి అన్ని టవర్స్ లలో ఉన్న జనరేటర్లు పనిచేసేలా డీజల్ బ్యాటరీలు చెక్ చేసుకోవాలని ఆదేశాలు ఇవ్వాలని అన్నారు. రేషన్ కు సంబంధించి నిత్యావసర వస్తువులు నేటి సాయంత్రం లోపు అన్ని ప్రాంతాలకు చేరేలా చూడాలని అన్నారు. 2 , 3 రోజులు జిల్లా కలెక్టర్ స్థాయి నుండి క్రింది స్థాయి వరకు కష్టపడి విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, చిన్న చిన్న వస్తువులను నిర్లక్ష్యం చేయకుండా రాత్రి సమయాలలో క్యాండిల్స్ వంటివి కూడా అందుబాటులో ఉండే విధంగా చూడాలని అన్నారు.

ఈ సమీక్షలో జిల్లా రెవిన్యూ అధికారి శ్రీనివాస రావు, జిల్లా అధికారులు ఆర్ అండ్ బి సుధాకర్ రెడ్డి, పంచాయితీ రాజ్ ఇంజనీర్ శంకర్ నారాయణ, పంచాయితీ అధికారి రాజశేఖర్ రెడ్డి, డివిజినల్ డెవలప్మెంట్ అధికారిణి సుశీలాదేవి, వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద రావు, పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వరులు, జిల్లా ప్రణాళికా అధికారి అశోక్ కుమార్, ఎస్.ఈ వెల్ఫేర్ అధికారి చెన్నయ్య, బి.సి. వెల్ఫేర్ అధికారి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి మునిసిపల్ పరిధిలోని ప్రజలు రానున్న వర్షాల వలన ఎలాంటి ఇబ్బందులు వున్నా వెంటనే తమ హెల్ప్ లైన్ నంబర్ 0877-2256766 కు ఫోన్ చేయాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. రానున్న వర్షాలను దష్టిలో వుంచుకొని ముందస్తు చర్యలపై బుధవారం తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డితో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. తరువాత మునిసిపల్ అధికారులతో ప్రత్యేక సమావేశమయ్యారు. కాలువలు ఏవైన మరమ్మత్తులు చేయాలంటె వెంటనే చేయాలని సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్ కు, శానిటేషన్, వైద్యం అందుబాటులో వుండేలా జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికష్ణకు, హెల్ప్ లైన్ వద్ద నిరంతరం విదుల్లో వుండేలా సిబ్బందిని ఏర్పాటుచేయాలని మేనేజర్ చిట్టిబాబుకు కమిషనర్ అనుపమ అంజలి ప్రత్యేక ఆదేశాలు జారి చేసారు.



ఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - క్యాంపస్

ఎస్ఎఫ్ఐ 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం నాయకులు ఎస్వీయూ ఆడిటోరియం దగ్గర మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.మాధవ్ మాట్లాడుతూ విద్య ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా ప్రభుత్వ విద్యాసంస్థల పరిరక్షణ కోసం, విద్యాసంస్థల ప్రజాస్వామిక హక్కుల కోసం భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఈనెల 13-16 తేదీల్లో జాతీయ మహాసభలు జరపనున్నట్లు తెలిపారు. మహాసభల జయప్రదానికి విద్యార్థులు, మేధావులు, విద్యావేత్తలు భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు భగత్ రవి, ఆఫీసు బేరర్స్ అక్బర్, ఉరుకుందు, హరిత, తేజ, నాయకులు శివ,పృధ్వి, రవి, హరీష్, సురేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.



అధ్యక్ష కార్యదర్శులుగా రవి, మాధవ్

తిరుపతి జిల్లా నూతన కమిటీని ఎస్ఎఫ్ఐ మూడో జిల్లా మహాసభలకు హాజరైన ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ తెలిపారు.ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన అధ్యక్షుడిగా బి.రవి, ప్రధాన కార్యదర్శి ఎన్. మాధవ్, ఉపాధ్యక్షులుగా అక్బర్, ప్రసన్న, ఉరుకుందు, సహాయ కార్యదర్శులుగా హరిత, తేజ, హరిక్రిష్ణ, జిల్లా కమిటీ సభ్యులుగా 17 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు..బుధవారం ఉదయం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో వైకాపా నేత రాష్ట్ర మాజీమంత్రి పేర్ని నాని, వైకాపా నేత శిద్దా రాఘవరావు, తెలంగాణ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, సినీ నటి ప్రణీత లు స్వామివారి సేవలో పాల్గొన్నారు. టిటిడి ఆలయ అధికారులు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

ఉద్యోగులకు జీతాలిచ్చే పరిస్థితి లేదు

రాష్ట్రంలో ఆరు నెలలుగా ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, పింఛన్ డబ్బులు ఇచ్చే పరిస్థితిలో వైకాపా ప్రభుత్వం లేదని, ఆగస్టు నెల నుంచి రాష్ట్ర ప్రభుత్వం అప్పులు మీద నడుస్తోందని తెలుగు దేశం నేత ఎమ్మెల్సీ అశోక్ బాబు తెలిపారు. బుధవారం ఉదయం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం అవలంభించే పద్ధతులు ప్రజలను ఇబ్బందులకు గురి చేసే విధంగా ఉన్నాయని, ఆ ఇబ్బందుల నుంచి స్వామివారు కాపాడాలని ప్రార్థించానన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలలో ఉన్న లోపలే రాష్ట్ర ప్రజలకు శాపంగా మారుతోందని ఆయన విమర్శించారు.

శ్రీవారి సేవలో దేవినేని

రాష్ట్ర ప్రజలను రక్షించేందుకు తిరుమల శ్రీవారు కొండ దిగే సమయం ఆసన్నమయిందని, ఇవాళ ప్రజలను కాపాడే తరుణం వచ్చిందని స్వామివారు మెట్లు దిగి వచ్చి కాపాడాలని తెలుగు దేశం నేత మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర అన్నారు. బుధవారం ఉదయం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

సిటీఛాంబర్ అయూబ్‌ఖాన్‌కు...

త్వరలోనే రాష్ట్రపతి భవన్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

సిటీ ఛాంబర్ అధ్యక్షులు అయూబ్‌ఖాన్‌కు త్వరలోనే రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం అందనుంది. రాష్ట్రపతి హోదాలో ద్రౌపది ముర్ము తొలిసారిగా తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసిన సందర్భంగా చిత్తూరు జిల్లాలో 25 సంవత్సరాల కాలంలో దాదాపు వెయ్యికి పైగా విశేష సేవా కార్యక్రమాలను, కోవిడ్ లాక్‌డౌన్‌లో 184 రోజుల పాటు వలస కార్మికులకు నిత్యావసర వస్తువులు, భోజనం, మాస్కులు, చేతి తొడుగులు అందించడంతో పాటు అనాధ పశువులకు పౌష్టిక దాణా అందించారు.ఈ నేపథ్యంలో రాష్ట్రపతిని అయూబ్‌ఖాన్ కలిసి సిటీఛాంబర్ కార్యక్రమాలను వివరించారు.త్వరలోనే రాష్ట్రపతి భవన్‌కు ఆహ్వానిస్తామని చెప్పడం గమనార్హం. అనంతరం అయూబ్‌ఖాన్, వ్యవస్థాపక కార్యదర్శి షణ్ముగం యాదవ్, ఉపాధ్యక్షులు కెఎస్ వాసు, పి.కరుణానిధి, స్టాన్లీ జయకుమార్ రాష్ట్రపతిని అభినందించారు. ఈ సందర్భంగా అట్లాంటిస్ వరల్డ్ స్కూల్ విద్యార్థులను రాష్ట్రపతి ప్రత్యేకంగా అభినందించారు.



వీవోఏల అధ్యక్ష కార్యదర్శులుగా ధనలక్ష్మి, వేణు

ప్రజాశక్తి-తొట్టంబేడు

సీఐటీయూ అనుబంధ తొట్టంబేడు మండల వీవోఏల సంఘం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో తొట్టంబేడు మండల వీవోఏల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి సీఐటీయూ అనుబంధ వీవోఏల సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మి హాజరయ్యారు. అధ్యక్షురాలుగా కే.ధనలక్ష్మి, కార్యదర్శిగా గెడి.వేణు, ఉపాధ్యక్షులుగా పి.చాముండేశ్వరి, జి.లావణ్య, సహాయ కార్యదర్శులుగా ఎర్రయ్య, వెంకటయ్య, కోశాధికారిగా రామయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ వీవోఏల చేత పాలక ప్రభుత్వాలు ఏళ్ల తరబడి గొడ్డు చాకిరి చేయించుకుంటున్నాయే తప్ప, వారికి ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించడంలో మొండి చేయి చూపుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్న వీవోఏలను హెచ్ఆర్సీ పరిధిలోకి తెచ్చి వారికి



కనీస వేతనం కింద రూ.26 వేలు ఇవ్వాలన్న ధోరణి ఏ మాత్రం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా వీవోఏలపై రాజకీయ వేధింపులకు దిగడం ఆనవాయితీగా మారుతోందనీ, ఈ వైఖరి మారాలన్నారు. సిఐటియు డివిజన్ ఇంచార్జి పెనగడం గురవయ్య మాట్లాడుతూ పదేళ్ల లోపు సర్వీసున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను తొలగించేందుకు వైసిపి ప్రభుత్వం అర్ధరాత్రి జీవో తేవడం సిగ్గుచేటనీ, అదే జరిగితే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

ప్రకటనలకే జాబ్ క్యాలెండర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

వైసీపీ అధికారంలోకి వస్తే ప్రతి ఏడాది జనవరిలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామన్నా హామీ ప్రకటనలకే పరిమితమైందని జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. 150 వారాలైనా సీపీఎస్ రద్దు చేయనట్టే, అవుట్ సోర్సింగ్ వాళ్లకి ఇచ్చిన ఉద్యోగ భద్రత హామీనీ గాలికి వదిలేసారన్నారు. తమను రెగ్యులర్ చేస్తారని, సమాన పనికి సమాన వేతనం ఇస్తారని ఎదురుచూస్తున్న రెండున్నర లక్షల మందికి పైగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఉపాధి పైన వేటు వేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి గ్రాప్లింగ్ కుస్తీ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్

నవంబర్ 24 నుంచి 27వ తేదీ వరకు అయోధ్యలోని నందిని నగర్‌లో రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన రెండవ జాతీయ స్థాయి క్యాడేట్, జూనియర్ బాల బాలికల గ్రాప్లింగ్ కుస్తీ ఛాంపియన్ షిప్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తానికి 50 మెడల్స్ వస్తే అందులో 11 మెడల్స్ శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు కైవసం చేసుకుని కళాశాల చరిత్రలోనే సరిక్రొత్త రికార్డును సష్టించారు .వారి వివరాలు ఇలా ఉన్నాయి. వి రుచిత, బి భవ్య శ్రీ బి సిల్వర్ మెడల్స్. టి అనూష, టి సాయిశ్రీ , జి నవ్య ,పి తనూజ భాయి, డి బిందు శ్రీ, ఎం పల్లవి, టి పావని బి బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వీరందరిని టీటీడీ జేఈఓ సదా భార్గవి- ఐఏఎస్, టిటిడి డీఈఓ డాక్టర్ ఎమ్ భాస్కర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. భువనేశ్వరి అభినందించారు. వీరందరికీ చక్కటి శిక్షణ ఇప్పించిన కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సాయి సుమతిని ప్రిన్సిపాల్ అభినందించారు. జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థినులను అధ్యాపకులంతా అభినందించి హర్షం వ్యక్తం చేశారు.



పోలీసు జులుం ప్రదర్శించొద్దు : డిఐజి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

సామాన్యులు, నిందితులపై పోలీసు జులుం ప్రదర్శించరాదని అనంతపురం రేంజ్ డిఐజి శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పోలీసు అధికారులను హెచ్చరించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం ఆయన శ్రీకాళహస్తి డిఎస్పి కార్యాలయానికి విచ్చేశారు. రికార్డులను పరిశీలించారు. శ్రీకాళహస్తి ప్రాంత పోలీసు అధికారుల పనితీరును ఆరాతీశారు. అనంతరం డిఐజి మీడియానుద్దేశించి మాట్లాడుతూ శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు సామాన్యులు, నిందితులపై విచక్షణాధికారాలు ప్రయోగించారన్న ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి ఆరోపణలకు తావు లేకుండా ఫ్రెండ్లీ పోలీస్ గా మసులుకోవాలని సూచించారు. అదేవిధంగా పెండింగ్ కేసుల పరిష్కారంలో పురోగతి లేదని అసంతప్తిని వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తిలో క్రైమ్ రేటు తక్కువగానే ఉన్న నేరగాళ్లు మాత్రం అధికంగా ఉన్నారనీ, వారిపై గట్టి



నిఘా పెట్టాలని సూచించారు. అదేవిధంగా శ్రీకాళహస్తి కేంద్రంగా మత్తు పదార్థాలవిక్రయాలు జోరుగా సాగుతున్నాయన్న సమాచారం ఉందనీ, మూలాలెక్కడో గుర్తించి ముఠాను పట్టుకుంటామని స్పష్టం చేశారు. అదేవిధంగా ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా పెడుతున్నామనీ, అందుకోసం ఓ ఎస్పీని నియమించినట్లు చెప్పారు. డీఎస్పీ విశ్వనాథ్, సిఐలు కష్ణమోహన్, విక్రమ్, ఎస్సైలు తిమ్మయ్య, రాఘువేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కరోనా సమయంలో ఇతర దేశాలకు సహకారం

భారత్ బయోటిక్ కో-ఫౌండర్ సుచిత్ర

ప్రజాశక్తి-వెంకటగిరి

కరోనా సమయంలో భారత్ బయోటిక్ ఇతర దేశాలకు వ్యాక్సిన్ అందించడం ఎంతో గర్వకారణంగా ఉందని భారత్ బయోటిక్ కో-ఫౌండర్, ఎమ్‌డి సుచిత్ర ఎల్లా తెలియజేశారు. బుధవారం 'మన డాక్టర్ మస్తాన్‌యాదవ్ ఛారిటబుల్ ట్రస్టు'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన వ్యక్తిగత వైద్యుడుగా ఉన్న మస్తాన్‌యాదవ్ తన ప్రాంతానికి సేవ చేయాలనే లక్ష్యంతో ఈ చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేయడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి మాట్లాడుతూ కరోనా సమయంలో కోవాక్సిన్‌ను రూపొందించిన భారత్ బయోటిక్ కో-ఫౌండర్‌ను ఈప్రాంతానికి తీసుకొని రావడంతో ఈప్రాంతానికే గర్వకారణమని డాక్టర్ మస్తాన్‌యాదవ్‌ను కొనియాడారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతంలో ఈ చారిటబుల్ ట్రస్టు



ఏర్పాటు చేయడం ఈప్రాంత ప్రజల అదృష్టమన్నారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు వచ్చిన బొలిగల మస్తాన్‌యాదవ్‌ను అభినందించారు. అనంతరం పేద మహిళలకు ఉచితంగా చీరలు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, వెంకటగిరి మాజీ శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

బనాల ఫార్మసీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - క్యాంపస్

స్థానిక తిరుపతి మారుతి నగర్ లోని బనాల ఫార్మసీ క్లినిక్ నందు బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు క్లినిక్ అధినేత రవీంద్రారెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బనాల ఫార్మసీ క్లినిక్ లో నిరుపేద ప్రజలకు దాదాపుగా 50 మందికి పైగా రోగులకు ఉచితంగా బీపీ షుగర్ పరీక్షలు నిర్వహించామన్నారు. పేదవారికి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. బనాల ఫార్మసీ ఆధ్వర్యంలో తిరుపతి సమీపంలోని గ్రామీణ ప్రాంతాల్లో వివిధ రకాల ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సాధారణ నిరుపేద ప్రజలు వైద్య శిబిరాల్లో పాల్గొని వారి ఆరోగ్య సమస్యలను పరిష్కార దిశగా వైద్యులు సలహాలు, సూచనలు అందిస్తారన్నారు. ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ ఆరోగ్యవంతంగా జీవించాలని కోరారు.



జీవన శైలిలో మార్పు అవసరం : డాక్టర్ కే.రాణి

ప్రజాశక్తి - క్యాంపస్



ప్రజల జీవన శైలిలో మార్పు తెచ్చుకొని అభివద్ధి పథంలో కొనసాగాలని డాక్టర్ కే.రాణి పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం ఇంటర్నేషనల్ డే ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబులిటి డే ని పురస్కరించుకొని శివజ్యోతి నగర్ లోని అంధుల శరణాలయంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పద్మావతి మహిళా అధ్యయనకేంద్ర లెక్చరర్ డాక్టర్ కే.రాణి 2022 వ సంవత్సరం ఓల్డ్ డిజేబుల్ డే థీమ్ అయినటువంటి సమ్మిళిత అభివద్ధి కోసం పరివర్తన పరిష్కారాలు : ప్రాధాన్యత, సమానమైన ప్రపంచానికి ఆజ్యం పోయడంలో ఆవిష్కరణల పాత్ర అనే అంశం గురించి వివరించారు. వికలాంగులు అన్ని కోణాలలో వత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో జాబ్ ఫోర్ యూత్ సిబ్బంది విజయ్ కుమార్, సలీం, సికిందర్, విశ్వనాథ్, మహిళా కేంద్ర సిబ్బంది డాక్టర్.ఎం. ఇంద్రాణి పాల్గొన్నారు.

ప్రైవేట్ సంస్థల వల్లేనా...!

తిరుమలలో 'నకిలీ టికెట్ల కేటుగాళ్లు'

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమలలో నకిలీ టిక్కెట్ల తాకిడి ఎక్కువయ్యింది. టీటీడీ ఎంత పకడ్బంధీగా వ్యవహరిస్తున్నామని చెబుతున్నా అమాయక భక్తులను కేటుగాళ్లు బురిడి కొట్టిస్తూనే ఉన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానమే ఆన్ లైన్ ఆర్జిత సేవా టికెట్లతో పాటు 300 టికెట్లు, సర్వదర్శనం ఇతరత్రా సేవా టిక్కెట్ల మంజూరుకు ప్రైవేటు సంస్థలపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా టిటిడి సొంతంగా 'శ్రీవారి దర్శన వెబ్ సైట్'ను ఏర్పాటు చేసుకొని టిక్కెట్లను విడుదల చేసే విధంగా ధర్మకర్తలి మండలిలో చర్చించి అమలు చేస్తే దళారుల బెడద తగ్గుతుందని రాజకీయ పార్టీల సూచనలను టిటిడి పట్టించుకోకపోవడం గమనార్హం.

తమిళనాడుకు చెందిన భక్తుల దగ్గర సుమారు 60వేలు తీసుకొని 4 తోమాల సేవ నకిలీ టికెట్లను, అద్దె గదులను ఏర్పాటు చేస్తామని చెప్పిన దళారి మాటలు నమ్మి మోసపోయిన భక్తులను విజిలెన్స్ అధికారులు గుర్తించడంతో భక్తుల ఫిర్యాదు మేరకు నకిలీ కేటుగాళ్ల కోసం విజిలెన్స్ అధికారులు గాలింపు చేపట్టారు. శ్రీవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల భక్తిని ఆసరాగా చేసుకుని నకిలీ టికెట్ల కేటుగాళ్లు పంజా విసురుతున్నారు అనేక రాష్ట్రాలలో ఫేక్ వెబ్ సైట్ లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూనే ఉన్నాయి! టీటీడీ అధికారిక వెబ్ సైట్ల ద్వారానే శ్రీవారి సేవ టికెట్లు కొనుగోలు చేయాలని భక్తులకు ఎప్పటికప్పుడు టీటీడీ అప్రమత్తం చేస్తున్నా...నకిలీ వెబ్ సైట్లు పుట్ట గొడుగుల్లా పుట్టుకురావడంతో ఏది "అఫీషియల్" ఏది "నకిలీ" అని గుర్తించలేని గందరగోళ పరిస్థితులు భక్తులలో నెలకొంటుంది! శ్రీవారి దర్శన నకిలీ టికెట్లతో మోసపోయిన ప్రతి భక్తుడూ విజిలెన్స్‌కి పిర్యాదు చేయడంలేదు. కేసుల గోల మనకు ఎందుకులేనని చాలా మంది మిన్నుకుండి పోతున్నారు, ఒక వేల అధికారుల దష్టికి తీసుకెళ్లినా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకోవడం పరిపాటైపోయింది! శ్రీవారి భక్తులను మోసగిస్తున్న నకిలీ టికెట్ల వెనక ఉన్న ప్రధాన సూత్రధారులపై కఠిన చర్యలు చేపట్టి, భవిష్యత్తులో ఇలాంటి మోసాలకు పాల్పడాలంటేనే భయపడేలా ధర్మకర్తల మండలిలో కఠిన నిర్ణయాలు తీసుకుంటే తప్ప ఈ సమస్య తీవ్రత తగ్గదు! శ్రీవారి భక్తులు పదేపదే దళారులు, నకిలీ కేటుగాళ్ల చేతిలో మోసపోకుండా "సైబర్ క్రైమ్ స్పెషల్ టీం" వింగ్ ను టిటిడిలో ఏర్పాటు చేసి శ్రీవారి భక్తులు మోసపోకుండా సత్వర చర్యలు చేపట్టాలని రాజకీయ పార్టీలు సూచిస్తున్నాయి.



మద్యం దుకాణాల్లో పరిశుభ్రత ప్రధానం

ప్రజాశక్తి-పాకాల

మద్యం దుకాణాల్లో పరిశుభ్రత ప్రధానమని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్స్పెక్టర్ రామకృష్ణశాస్త్రి అన్నారు. చిత్తూరు జిల్లా ప్రొహిబిషన్- ఎక్సైజ్ సూపరింటెండెంట్ దయాసాగర్ ఆదేశాల మేరకు ఆయన బుధవారం పాకాల పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణాలలో పనిచేస్తున్న సిబ్బంది దుకాణాలను శుభ్రంగా ఉంచుకోవడం లేదని.. అలాంటి దుకాణాలను గుర్తించి శుభ్రం చేయిస్తున్నామన్నారు. అనంతరం సిబ్బందికి తెలియకుండా విక్రయాలపై అడిగి తెలుసుకున్నారు. నిల్వలను పరిశీలించారు. హెడ్ కానిస్టేబుల్ నాగరాజు , సూపర్వైజర్లు పాల్గొన్నారు.

పశువులకు ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి- పిచ్చాటూరు

పిచ్చాటూరు మండలంలోని కారూరులో పశు వైద్యాధికారి డాక్టర్ మంజుల ఆధ్వర్యంలో పశువులకు ఉచిత వైద్య సేవలు అందించారు. 30 దూడలకు నట్టల నివారణ, 25 పశువులకు గర్భకోశ చికిత్సలు, 45 పశువులకు సాధారణ చికిత్సలు, 350 పశువులకు మందుల పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మంజుల మాట్లాడుతూ పశు సంపద బాగుంటేనే పాడి పరిశ్రమ బాగుంటుందన్నారు. అనంతరం లంపీ చర్మవ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు నాగేంద్ర, విజయ్ కుమార్, జ్యోతి, గోపాలమిత్ర మోహన్ పాల్గొన్నారు.

చింతలచేను రోడ్డు వెంటనే పూర్తి చేయండి

తిరుపతి టౌన్: తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని చింతలచేను మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని కమిషనర్ అనుపమ అంజలి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి అభివృద్ధిలో భాగంగా చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్ల స్థితిగతులపై పరిశీలనలో భాగంగా బుధవారం కమిషనర్ అనుపమ అంజలి చింతలచేను మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను పరిశీలిస్తూ రోడ్డు నిర్మాణానికి స్థలాలు ఇస్తున్న యజమానులకు ఏమాత్రం ఆలస్యం కాకుండా టి.డి.ఆర్ బాండ్లను మంజూరు చెయ్యాలన్నారు. రహదారులు అభివృద్ధి చెందితే, వాటి చుట్టు ప్రక్కల వుండే భూములు కూడా అభివృద్ధి చెందడంతోబాటు నగరం కూడా అభివృద్ధిలో ముందుంటుందనే విషయాన్ని మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మించే ప్రాంతాల ప్రజలకు వివరించాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట అదనపు కమిషనర్ సునీత, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి : ఎస్టియు

తిరుపతి టౌన్: ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని ఎస్టియు నేతలు హెచ్చరించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఎస్టియు రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 20న చలో విజయవాడకు పిలుపు ఇచ్చామని, నేటికీ జీతాలు జమ కాకపోవడం, పిఆర్సీ, డిఏలు, పిఎఫ్ రుణాలు, మెడికల్ బిల్లుల బకాయిలు చెల్లింపుల్లో తీవ్ర జాప్యానికి నిరసనగా రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర సంఘం పిలుపు మేరకు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తాళ్లూరు శ్రీనివాసులు ,రాష్ట్ర కార్యదర్శి రమేష్ బాబు పాల్గొన్నారు.అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావుకి వినతిపత్రం సమర్పించారు.

మహిళలపై హింసను మానుకోవాలి

పుత్తూరు టౌన్: మహిళలపై హింస వద్దు.. సురక్షిత సమాజం కావాలని పుత్తూరు ఐసీడీఎస్ సూపర్వైజర్ భారతి ఆధ్వర్యంలో పుత్తూరు మెయిన్ స్కూల్‌లోని అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులు అగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే తిరుమలకుప్పం గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో మహిళల చట్టాలపై ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు హైమా, సరోజమ్మ సహాయకులు సంపూర్ణ, మాధవి, తల్లులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గూడూరు

రానున్న మూడు రోజుల్లో వానలు పడనుండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని గూడూరు సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో వ్యవసాయ శాఖ సిబ్బందికి సహాయ వ్యవసాయ సంచాలకులు గోపినాయక్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న మూడు రోజులు 8,9,10వ తేదీలలో వర్షాలు ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని, నార్లు, నాట్లు వేసే రైతులు, పురుగు మందులు, ఎరువులు వేసుకునే రైతులు ఈ మూడు రోజుల అనంతరం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గూడూరు మండల వ్యవసాయ అధికారి రమేష్, టెక్నికల్ ఏవో చెంచురెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి స్వాగతం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి రేణిగుంట విమానాశ్రయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి స్వాగతం పలికారు. సీఎం జగన్ నెల్లూరు జిల్లా పర్యటన నిమిత్తం బుధవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకోగా ఎమ్మెల్యే ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

సీపీఎం ధర్నా

పుత్తూరు టౌన్: పట్టణంలోని ద్రౌపదీ ధర్మరాజుల గుడి ఎదురుగా గేటు పుత్తూరుకు వెళ్లేందుకు అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని.. రైల్వే అధికారులు దారి లేకుండా మూసి వేయడంతో ప్రజ లు ఇబ్బందులు పడుతున్నారని.. దారి సౌకర్యం కల్పించాలని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యదర్శి వెంకటేష్, దళిత, గిరిజన సంఘ జిల్లా కార్యదర్శి నందయ్య మాట్లాడుతూ గేట్ పుత్తూరుకు, చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు గత 150 సంవత్సరాలుగా దారి ఉందని.. అలాంటి దారిని రోజు రైల్వే అధికారులు మూసి వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు, అన్ని పార్టీల నాయకులు స్పందించి గేట్ పుత్తూరు ప్రజలకు అండగా నిలవాలని కోరారు. అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని.. ప్రత్యామ్నాయ దారి కల్పించాలని.. లేనిపక్షంలో ప్రజా సంఘాలతో కలిపి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భవన కార్మికుల సంఘం నాయకులు సుబ్రహ్మణ్యం, శేఖర్, ప్రకాష్ , మహిళలు విద్యార్థులు పాల్గొన్నారు.



'మత్తు'కు బానిసయ్యేనా...?

ప్రజాశక్తి-తిరుపతి సిటి

శస్త్రచికిత్సలు చేసుకునేవారికి, అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు, వెంటిలేటర్లపై ఉండే రోగులకు మత్తు మందును ఇచ్చే అనస్థిషియా టెక్నీషియన్ అదే మత్తుమందు అధికమోతాదులో తీసుకోవడంతో అనుమానాస్పద రీతిలో మృతి చెందిన సంఘటన బుధవారం తిరుపతిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... నెల్లూరు జిల్లా వెంకటరెడ్డిపల్లికి చెందిన కె.శీనయ్య కుమారుడు కొయ్యలగుంట అఖిల్(22) అనస్థిషియా టెక్నీషియన్ కోర్సు పూర్తి చేసి తిరుపతిలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నాడు. రోజులాగే మంగళవారం రాత్రి నైట్ డ్యూటీకి వచ్చాడు. సుమారు 10 గంటల ప్రాంతంలో అతను కనిపించకుండా పోయాడు. ఆసుపత్రి సిబ్బంది అతన్ని రెండు గంటలు పాటు వెతికినా కనిపించకపోయేసరికి అత్యవసర పరిస్థితిలో రోగికి వైద్యం అందించేందుకు బయట నుంచి మరో టెక్నిషన్ పిలిపించి వైద్యం అందించారు. వేకువ జామున రెండు గంటల ప్రాంతంలో ఎంఐసియులో పనిచేసే నర్సు వాష్‌రూమ్‌కు వెళ్లడంతో ఆ గది తలుపులు లోపల గడియపెట్టి ఉంది. దీంతో ఆసుపత్రి మేనేజరుకు సమాచారం అందించారు. ఆసుపత్రి మేనేజరు అక్కడికి చేరుకుని రాత్రి నుంచి కనిపించకుండా పోయిన అఖిల్‌పై అనుమానం వచ్చి అతనికి ఫోన్ చేశారు. బాత్‌రూమ్ గదిలో ఫోన్ రింగుకావడంతో సిబ్బంది ద్వారా తలుపు బద్దలకొట్టారు. గదిలో అఖిల్ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అతని పక్కనే మత్తుమందు వేసుకున్న సిరంజ్, గ్లౌజ్ పడిఉన్నాయి. వెంటనే అతన్ని బయటకు తీసుకొొచ్చి పరీక్షించి వైద్యులు అప్పటికే అఖిల్ మృతి చెందాడని నిర్ధారించారు. ఈ విషయాన్ని మృతుని కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుని కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద తమ బిడ్డ మృతిపై నిజాలు తెలియజేయాలని ఆందోళన నిర్వహించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్తుకు బానిసయ్యేనా...

వృత్తిరీత్యా అనస్థిషియా టెక్నీషియన్ అయిన అఖిల్ గత కొంత కాలంగా మత్తుమందుకు బానిస అయ్యాడు. తిరుపతిలో రెండు మూడు ఆసుపత్రుల్లో పని చేశాడు. ప్రతి ఆసుపత్రిలోనూ రెండు, మూడు నెలలకు మించి పని చేయలేదు. మూడు నెలల క్రితం అఖిల్ ప్రస్తుతం మృతి చెందిన ఆసుపత్రిలో విధుల్లో చేరాడు. తరుచూ మత్తు మందును వేసుకుని విధులు నిర్వహించేవాడని, తాజాగా మంగళవారం రాత్రి మత్తుమందు వేసుకునేనేందుకు బాత్‌రూమ్‌కు వెళ్లి, మోతాదుకు మించి మత్తు మందు వినియోగించడంతో అక్కడికక్కడే మృతి చెందాడని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఇందుకు సంబంధించి మత్తుమందుకు లోడ్‌చేసుకునే దృశ్యం, సిరంజ్, గ్లౌజ్ తీసుకుని బాతురూమ్‌కు వెళ్లిన దృశ్యాలు ఆసుపత్రి ఎంఐసియు వార్డు, ఇతరత్రా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలో నిక్లిప్తమయ్యాయి. దీని ఆధారంగానే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనస్థిషియా టెక్నీషియన్ మృతి



నిద్రపోతున్నాడనుకున్నాం...

మంగళవారం రాత్రి డ్యూటీకి వచ్చిన అఖిల్ 9.45 గంటల నుంచి కనిపించకుండా పోయాడు. నైట్ డ్యూటీకావడంతో ఎక్కడైనా గదిలో నిద్రపోయాడని బావించి సిబ్బంది ద్వారా వెతికించాం. ఆచూకిలేదు. అర్ధరాత్రి ఓ రోగికి అత్యవసర చికిత్స చేయాల్సి రావడంతో మత్తు మందు ఇచ్చేందుకు అఖిల్ అందుబాటులో లేకపోయేసరికి వేరే టెక్నీషియన్‌ను పిలిపించి చికిత్స అందించాం. ఉదయం నర్సు బాత్‌రూమ్‌కు వెళ్లేందుకు వెళ్లడంతో సంఘటన వెలుగుచూసింది. అఖిల్ మత్తుమందు వినియోగించినట్లు బాత్‌రూమ్‌లో దొరికిన ఆధారాలను బట్టి నిర్ధారించుకున్నాం. ఓ టెక్నీషియన్ ఇలా మత్తుకు బానిసై ఆ మత్తువల్లే మృతి చెందడం బాధాకరం.

-డాక్టరు అనంత్‌నాగ్, డైరెక్టర్. సంకల్ప ఆసుపత్రి.

సర్పంచుల సమస్యలపై సీఎంను కలుస్తాం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



జనవరి 5వ తేదీ తాడేపల్లి లోని సిఎస్ఆర్ కళ్యాణ మండపంలో పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులతో కలిసి రాష్ట్ర సర్పంచుల సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు ఉమ్మడి కడప జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సర్పంచుల సంఘం నాయకులు శివచంద్రారెడ్డి మాట్లాడుతూ బాబు రాజేంద్రప్రసాద్ ఏర్పాటుచేసిన సర్పంచుల సంఘంతో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులను కలిసి గ్రామపంచాయతీ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర గ్రామ పంచాయతీ సర్పంచుల కార్యవర్గంను ఎన్నుకొని అటు తరువాత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి సర్పంచుల మనోభావాలు దెబ్బ తినకుండా గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం తగిన నిధులను సమకూర్చుకోవడానికి కార్యాచరణతో ముందుకెళుతున్నామన్నారు. ఎప్పటినుండో కరెంటు బిల్లులు కట్టకుండా పేరుకుపోయాయని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకున్న 8600 కోట్లు పాత విద్యుత్ బకాయిలన్నారు. అయితే ఇంకను విద్యుత్ బిల్లులు పెండింగ్లో ఉన్నాయని అన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు తరువాత గ్రామ సర్పంచులకు తగిన ప్రాధాన్యత లేకుండా పోయిందని వారన్నారు. పంచాయతీలను అభివృద్ధి చేసుకోవడానికి స్థానికంగా ఉన్న చిన్న చిన్న పనులకు పంచాయతీలలో నిధులు లేకపోవడం వలన ఇబ్బందులు పడుతున్న పరిస్థితి వాస్తవమే అన్నారు. ఈ సమావేశంలో అఖిలభారత పంచాయతీ పరిషత్తు జాతీయ కార్యదర్శి జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ విద్యుత్ బిల్లులపై విద్యుత్ శాఖ అధికారులు వడ్డీలకు వడ్డీలు వేస్తున్నారని, గ్రామపంచాయతీలలో విద్యుత్ బిల్లులను తగ్గించుకోవడానికి సోలార్ విద్యుత్తు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచ్ గౌరవవేతనాన్ని 3 వేల నుండి 15 వేలకు పెంచాలని, సర్పంచులు ఎవరైనా అకాల మరణం చెందితే 20 లక్షలు పరిహారం ఇవ్వాలని, 15వ ఆర్థిక సంఘం నిధులు పిఎంఎఫ్ఎస్ లింకేజీ ఉన్న కొత్త బ్యాంకు ఖాతాలోని వేయాలని, మైనర్ పంచాయతీ కరెంటు బిల్లులు తాగునీటి సరఫరాకి వీధిలైట్లకు రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా కరెంటును సరఫరా చేయాలని, సచివాలయాలపై వచ్చే ఆదాయాన్ని గ్రామ పంచాయితీ ఖాతాలోని జమచేయాలని, గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని, అలానే రాష్ట్రంలోని గ్రామపంచాయతీ సర్పంచులకు ఏడాదిలో ఒకరోజు తిరుమల శ్రీవారి దర్శనాన్ని కలిగించాలని ఈ మేరకు సీఎం దష్టికి ఈ డిమాండ్లను తీసుకెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం నాయకులు బంగారుపాలెం వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, వెంకటరమణ, ముసుగు కోటేశ్వరరావు, సెల్వం, సిహెచ్ పాపారావు, షేక్ అల్లాబక్ష్, మనోహర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

విద్యామత్ మహోత్సవాన్ని విజయవంతం చేయండి : డిఇఒ

ప్రజాశక్తి - క్యాంపస్

మారుతున్న కాలానికి అనుగుణంగా మనం మారాలని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రతి టీచర్ వారి వారి సబ్జెక్టులలో అప్ డేట్ అవుతూ , సాంకేతిక విషయావగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని, అందుకు దీక్ష విద్యా అమత్ ప్రోగ్రామ్ ద్వారా మన ప్రతిభను నిరూపించుకోవచ్చుని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి. శేఖర్ అన్నారు. బుధవారం తిరుపతి నగరంలోని శ్రీ వేంకటేశ్వర క్యాంపస్ పాఠశాలలో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో జిల్లా స్థాయి విద్యామత్ మహోత్సవ శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేశారు.జిల్లాలోని 34 మండలాల నుండి ఎంపిక చేసిన 80 మంది టీచర్లుకు దీక్ష కోఆర్డినేటర్ నీలకంఠం వారి బందం అవగాహన కల్పించారు. త్వరలో మండల స్థాయిలో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, టీచర్లకు, సి.ఆర్.పి.లకు శిక్షణ ఇవ్వనున్నట్లు అకడమిక్ మానెటరింగ్ ఆఫీసర్ శివ శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఉప విద్యాశాఖాధికారి ఆనందరెడ్డి , సమగ్రశిక్ష ఏ. ఏ.ఎమ్.ఓ. మధు, ఏఎస్ఓ రుక్మంగద, రిసోర్స్ పర్సన్ లు కల్పన, హరి శంకర్, సౌజన్య, బాబూలాల్ ,మనోహర్ యువశ్రీ మురళి తదితరులు పాల్గొన్నారు.



హెల్త్ కేర్ సెంటర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ

మండలంలోని హెల్త్ కేర్ సెంటర్‌ను బుధవారం ప్రపంచ బ్యాంక్ కన్సిలేషన్ డాక్టర్ సందేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా సంక్రమిత వ్యాధులైన టీబీ, లెప్రసీల సమాచారాలను అసంక్రమిత వ్యాధులైన బీపీ షుగర్, క్యాన్సర్ సర్వే నిర్వహణ పద్ధతి యాప్ లో నమోదు అనంతరం వైద్యాధికారి వద్దకు సంబంధించిన రిపోర్టులు వస్తాయన్నారు. 104 సిబ్బంది పర్యవేక్షిస్తారని తెలిపారు. మందుల లభ్యత.. నిల్వ నిర్వహణను పరిశీలించారు. గర్భిణులు, చిన్న పిల్లలకు అందుతున్న సేవలు, వ్యాధి నిరోధక టీకాల నిర్వహణ పరిశీలించారు. డీపీవో ప్రకాష్, వైద్యులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కారుమూసివారికండ్రిగ క్రీడాకారుడికి సన్మానం

ప్రజాశక్తి-నాయుడుపేట రూరల్: నాయుడుపేట మండలం జూలపాలెం పంచాయతీ కారుమూసివారికండ్రిగ గ్రామానికి చెందిన రమేష్ అంతర్జాతీయ స్థాయి ఏషియన్ జూనియర్స్ పోటీల్లో రన్నర్ గా నిలిచి సిల్వర్ పతకాన్ని సాధించాడు. తిరిగి స్వగ్రామానికి రావడంతో నాయుడుపేట గ్రామస్థులు సన్మానించారు. సర్పంచ్ వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ వంశీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

వాహనం సహా ఎర్రచందనం స్వాధీనం

ప్రజాశక్తి-యర్రావారిపాలెం

అటవీశాఖ క్షేత్రాధికారి ఎం.దత్తాత్రేయకు అందిన రహస్య సమాచారం మేరకు.. ఎర్రవారిపాలెం మండలం నెరబైలు గ్రామపంచాయతీ బీజేపల్లి గ్రామ సమీపంలోని మామిడి తోటలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేగంగా వస్తున్న కారు, బైకును వెంబడించడంతో వాహనాలను వదిలి పారిపోయారు. వాహనాలను పరిశీలించగా కారులో ఆరు ఎర్రచందనం దుంగలు ఉండటంతో స్వాధీనం చేసుకున్నారు. దాడులోల నెరబైలు ఎఫ్ఎస్‌వో ప్రదీప్ కుమార్, ఎఫ్‌బీవోలు రాజేష్, నిఖిల్, లక్ష్మీ ప్రసాద్, ప్రదీప్ చాంద్, సురేష్, సదాశివ, లోకనాథం, బేస్ క్యాంప్ సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు ఓ వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన భాకరాపేట సమీపంలో జరిగింది. భాకరాపేట ఎస్సై ప్రకాష్ కుమార్ కథనం మేరకు.. భాకరపేట సమీపంలోని మఠం చెరువు వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఓ వృద్ధుడు(60) మృతిచెంది ఉన్నట్లు తెలియడంతో పోలీసులు చేరుకున్నారు. తెల్ల చొక్కా ధరించి ఉన్నాడు. వృద్ధుడి వివరాలు తెలిసిన వారు ఫోన్‌నంబు 9440900711ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

ప్రజాశక్తి-రేణిగుంట: అడవిలో ఈతకు వెళ్లి తిరుపతికి చెందిన ఓ విద్యార్థి మృతిచెందాడు. తిరుపతికి చెందిన రేవంత్(18) బుధవారం స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లి నీటి గుంతలో దిగాడు. అయితే లోతుకి వెళ్లిపోవడంతో పైకి రాలేకపోయాడు. తోటి స్నేహితులు ఆ విద్యార్థి కోసం గాలించినప్పటికీ ఫలితం లేదు. రేవంత్ మృతదేహాన్ని వెలికి తీశారు.



ఘనంగా క్రిస్‌మిస్ వేడుకలు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ముందస్తు క్రిస్‌మిస్ వేడుకలను బిషప్ జార్జ్‌పాప పాఫఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కల్వరిప్రేయర్ హౌస్‌లో జరిగిన కార్యక్రమానికి బిషప్ కౌన్సిల్ చైర్మన్ డాక్టరు ఎలమంచిలి ప్రవీణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు ఏసు ఈ లోకానికి వెలుగై ఉన్నాడని, ఆయన పంచిన ప్రేమని అందరికి పంచడమే క్రిస్‌మిస్ అని వివరించారు. పది మంది పేదలకు సహాయం చేసే గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా బిషప్ కౌన్సిల్ కార్యవర్గం అంతా కలిసి క్యాండిల్ వెలిగించి, కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. బిషప్ జార్జ్‌పాపఫ్ నూతనంగా నిర్మించిన సిపిహెచ్ ప్రేయర్ హౌస్‌ని వై.ప్రవీణ్ ప్రారంభించారు. అనంతరం జరిగిన బిషప్ కౌన్సిల్‌లో పలు అంశాలపై చర్చించి రాష్ట్రంలో బరియల గ్రౌండ్స్, పాస్టర్ల గౌరవవేతనం గురించి ప్రభుత్వం రూల్స్ సడలించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించారు. బిషప్ బాలరాజు, వానాల డేవిడ్, మోజెస్ విక్టర్‌పాల్, నవీన్‌కుమార్, మోహన్‌రావు ప్రసాద్ ప్రభు కుమార్, అభిషేక్ విజయ్‌కుమార్, రత్నరాజు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ బీసీలకు న్యాయం చేశారు : డిప్యూటీ సిఎం

పజాశక్తి-తిరుపతి(మంగళం)

నందమూరి తారక రామారావు బీసీలకు న్యాయం చేశారని, అటు తరువాత నేడు రాష్ట్రంలో కులాలకతీతంగా సంక్షేమ కార్యక్రమాలు ఒక్క ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాత్రమే చేశారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల ఓట్లతోనే తాము విజయం సాధించామని చెబుతున్న చంద్రబాబు ఆ బీసీలకు ఏమి చేశారో చెప్పాలన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై నిరాధార స్టేట్మెంట్లు ఇస్తున్నారన్నారు. బీసీ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి 18,750 రూపాయలు అందిస్తున్నారన్నారు. ఇంత చేస్తున్న జగన్ మోహన్ రెడ్డి బీసీలకు ఏమీ చేయలేదని ప్రచారం చేస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడుకి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఆకాశం భూమికి ఉన్నంత తేడా ఉందన్నారు. కుప్పం ప్రాంతాన్ని చంద్రబాబు ఏనాడు అభివద్ధి చేయాలని అనుకోలేదని, నేడు మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో కుప్పం ప్రాంతంలో అనేక అభివద్ధి కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఎన్టీఆర్ ను వెన్నుపోటు పొడిచి ఎదిగిన చంద్రబాబు విద్యార్థి దశ నుండి కుల రాజకీయాలను చేయడం మొదలు పెట్టాడన్నారు. ఇప్పుడు పవన్ కళ్యాణ్‌ను వాడుకుంటూ ఆపసోపాలు చేయాలని కుట్రపన్నాడన్నారు.

'జయహో బీసీ మహాసభ'లో మేయర్



తిరుపతి టౌన్ : 'జయహో బీసీ మహాసభ'లో పాల్గొన్న మేయర్ డాక్టర్ శిరీష రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి కి వెంకటేశ్వర స్వామి బొమ్మను బహుకరించారు. బుధవారం విజయవాడలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన బీసీ మహాసభకు తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష హాజరయ్యారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా తిరుపతికి గుర్తింపు ఉందని, అందులో బీసీ మహిళగా మేయర్ పదవిని తనకి ఇచ్చినందుకు ముఖ్యమంత్రివర్యులు జగన్మోహన్ రెడ్డి కి, తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి కి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలని ఆర్డీవోకు వినతి

గూడూరు రూరల్: చిల్లకూరు, కోట మండలాల్లో జరుగుతున్న అక్రమ సిలికా మైనింగ్‌ను నిలిపి పర్యావరణాన్ని, ప్రకతి సంపదను సంరక్షించాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు డిమాండు చేశారు. ప్రభుత్వ భూముల్లో నిబంధనలకు వ్యతిరేకంగా మైనింగ్ చేస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలని బుధవారం ఆర్డీవో కిరణ్ కుమార్‌కు జనసేన పార్టీ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చిల్లకూరు, కోట మండలాల్లో నిబంధనలకు విరుద్ధంగా సిలికా అక్రమ మైనింగ్ నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారన్నారు. నిబంధనలు పాటించకుండా లీజుకు ఇచ్చిన భూముల్లో 2.5 మీటర్ల లోతు తవ్వాల్సిఉండగా నిబంధనలకు విరుద్ధంగా 7 నుంచి 8 మీటర్ల లోతుకు తవ్వడంతో పాటు ప్రకతి సిద్ధంగా ఏర్పడ్డ సోన కాలువలకు 50 మీటర్ల దూరం తవ్వాల్సి ఉన్నా 10 మీటర్ల దూరంలో తవ్వుతున్నారు. లీజుకు ఇచ్చిన భూమితో పాటుగా పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను లీజు భూముల్లో కలుపుకొని అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. వెంటనే అక్రమ మైనింగ్‌ను ఆపకుంటే జనసేన పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు, పర్యావరణ ప్రేమికులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఇమ్రాన్, నాగార్జున, విష్ణు, వంశీ కుమార్, శివ పాల్గొన్నారు.

రోగనిరోధక శక్తి పాత్ర కీలకం : ఆచార్య దిపాంకర్ నంది

ప్రజాశక్తి - క్యాంపస్

మానవాళి ఆరోగ్య పరిరక్షణలో రోగనిరోధక శక్తి పాత్ర ఎంతో కీలకమని బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అధ్యాపకులు ఆచార్య డి. దిపాంకర్ నంది పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయాన్ని సందర్శించి వర్శిటీలోని జంతుశాస్త్ర విభాగం సెమినార్ హాలులో 'టి సెల్ కో- స్టిమ్యులేషన్, యాంటీ-ట్యూమర్ రస్పాన్సెస్ అండ్ ది 2018 నోబెల్ ప్రైజ్' అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ విద్యార్థులకు బోధన, పరిశోధనా రంగాల్లో దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వినూత్న ఆవిష్కరణలకు అనువైన ప్రయోగశాలలు, అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉండాలని సూచించారు. అప్పుడే పరిశోధకులకు నాణ్యమైన పరిశోధనలు చేసేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆచార్య దిపాంకర్ నందిని దుశ్శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగం ఇంఛార్జి విభాగాధిపతి డాక్టర్ ఎం. రాజశేఖర్, తిరుపతి ఐజర్ అధ్యాపకులు డాక్టర్ శివకుమార్, వైరాలజీ విభాగాధిపతి డాక్టర్ రజని, అధ్యాపకులు డాక్టర్ హేమ, డాక్టర్ చరిత పాల్గొన్నారు.